# 32 డౌన్ క్రాసింగ్

ఇంట్లో పెద్ద పోట్లాట జరిగిన తరువాత అన్నాలు సయించవు. రాధకు ఆ రోజున ఇంట్లో ఎవరో చచ్చిపోయినట్టుంది. ఆ పిల్ల నామకార్థం ఎంగిలిపడి లేచింది. ఆమె చెయ్యి కడుక్కొని లోపలికి రాగానే రామనాథం, "పెట్టె సర్దుకో! బండికోసం పంపించాను" అన్నాడు. రాధ కర్థమయింది. బెదిరిస్తారా? ఏమయినా సరే ఇక వెనక్కు తియ్యదలచలేదు. ఆ ఇంట్లో తన్ను కూడా ఒక మనిషిని చూచినట్టు చూస్తేనే గాని తను సాగనివ్వబోవటంలేదు. అట్లా జరగని పక్షంలో ఇదయినా మంచిదే! పెట్టె సర్దాలట! భయమా?

అయిదు నిమిషాలలో రామనాథం మళ్ళీ వచ్చి, "సిద్ధంగా ఉన్నావా?" అన్నాడు. రాధ, సిద్ధంగానే ఉన్నానన్నది. ఆమెను బండిదాకా ఎవ్వరూ సాగనంపలేదు. వాకిలి దగ్గర అత్తగారెదు రొచ్చింది. రాధ పళ్ళు పట పట

కొరుక్కున్నది. వెధవావిడ ఎదురొస్తే తనకు లభించబొయ్యే లచ్చి వెనుక్కి పోతుంది? వెధవ వేషాలు.

రాధ వెనుక రామనాథం కూడా బండిలో ఎక్కి కూర్చున్నాడు. ఇద్దరూ మాట్లాడ లేదు. మనం ఎక్కడికి పోతున్నాం? ఎందుకు? అని రాధ అడగలేదు, మొగుడు చెప్పనూలేదు. అడగటమెందుకు? తెలుస్తూనే ఉంది. తన్ను పుట్టింటికి పంపుతున్నారు. తన తప్పేముంది. తను పోతాననలేదు. ఈ కౄరకం భరించ లేక పోవాలనిందానికి ఎదురా?

స్టేషనులో రాధను ఒక చోట కూర్చోబెట్టి రామనాథం రెండు సెకండు క్లాసు టికెట్లు అత్తవారూరుకు కొనుక్కొచ్చాడు. రైలు సాగింతరువాత కొద్ది సేపు చెరో కిటికీ లోనించి ఇద్దరూ బయటికి చూస్తూ కూర్చున్నారు. చివరకు రామనాథం రాధ దగ్గిరకొచ్చి కూచుని, "నిన్ను మీ వాళ్ళింట దిగబెట్టేస్తాను. నువ్వు మళ్ళీ మా ఇంటికి రానక్కరలేదు. ప్రతి నెలా నీకు డబ్బు పంపు తూంటాను." అన్నాడు.

రాధ ధైర్యంగానూ, కొంచెం ఎగతాళిగానూ నవ్వుతూ, "నేనూ అను కున్నాను లెండి! అయినా నేనేం అపకారం చేశాను?" అన్నది.

రామనాథం జవాబు చెప్పలేదు.

"నేను మీ అమ్మగార్ని గాని, మీ అన్నగార్ని గానీ, వదినెగార్ని గానీ, ఏ విధంగానూ ఎన్నడూ మాట్లాడనైనాలేదు. పైగా గౌరవంగాకూడా చూశాను. నన్ను వాళ్ళు తిరిగి ఎందుకు మనిషల్లే చూడకూడదు. వాళ్ళు నన్ను బానిసను చూసినట్టు చూస్తే పడుండక పోవడమేనా? నా తప్పు? దానికిది శిక్షా? నాకిదేమీ శిక్షగా లేదు. ఈ క్షణంలో నా కష్టాలు గట్టెక్కిన వనుకొంటాను. నాకు పుట్టింటి కెళ్ళటాని కభ్యంతరం ఉండకపోవచ్చునని మీ వాళ్ళకెందుకు తోచలేదో నాకర్థం కాకుండా ఉంది."

"ఇందులో మావాళ్ళను కలపకు. ఈ పని నా అంతట నేనే చేస్తున్నాను." అన్నాడు రామనాథం.

"మీరు మాత్రం! మీకు నేనేం అపకారం చేశాను? పెళ్ళయిన రోజునించీ మీ మీద నా కెంతో ఆపేక్షగా ఉండేది. ఈ రోజున నేను మిమ్మల్ని విడిచిపెట్టి పోవటానికి సంతోషిస్తున్నానంటే ఆ తప్పు మీదే. మీ విషయంలో ఒక్కరవ్వ నేను మనశ్శరీరాలు దాచుకోలేదు. మిమ్మల్ని సంతోషపెట్టాలనీ, సుఖపెట్టాలనీ నా చాతనయినంత ప్రయత్నం చేశాను. మీ అమ్మ నన్ను ఇంటి కుక్కను చూచినట్టు చూస్తుంటే మీరు ఒక్కసారి నా పక్షం పలకలేదు. మీరు నన్ను

కుక్కల్లేనే చూశారు. ఆవిడ ఆచారవంతురాలు కావటంచేత నన్ను చీపురుకట్టతో కొట్టవచ్చింది. మీరు నన్ను పెంపుడు కుక్కగా చూసి ఆదుకున్నారు. అంతే భేదం!"

రామనాథం భార్య వంక చూస్తూ మాట్లాడే ప్రయత్నం చేయలేదు.

"అసలు నా ప్రేమతో మీకు పనే లేకపోయింది. అనేకసార్లు మీ మాటలతోనైతేనేం మాట్లాడక పోవడంతోనైతేనేం క్రియలతోనైతేనేం ఏమీ చేయకుండా ఊరుకోవడంలో నైతేనేం నాకు ఉత్సాహ భంగం చేశారు. నా మనస్సు నిండి పొర్లుతూ ఉండి మాట్లాడుతూ ఉన్నప్పుడు ప్రసంగం మార్చారు. వినకుండా లేచిపోయినారు. మొదటనించీ మీరిట్లాగే ఉన్నారు. మీలో మార్పొచ్చిందనీ ఆ మార్పు కెవరు కారణమో నాకు తెలీక పోలేదు."

జవాబు లేదు.

"మొదట్లో నాకు, ఎవరేమన్నా సరే, పొద్దుగూకులూ మీ ఎదురుగ్గా కూర్చోవాలనిపించేది. మీతో మాట్లాడాలనిపించేది. అంత చిన్న కోరిక్కూడా తీర్చలేదు మీరు. ఇటువంటి సుఖంకూడా ఈ జన్మకు లేదా అని నా మనస్సెంత తరుక్కుపోయేదో మీకేం తెలుస్తుంది? చివరకు నా మనస్సు విరిగిపోయింది. నేనన్నింటికీ తెగబడ్డాను. మీ వాళ్ళతో పోట్లాడాను. ఇప్పుడింటికి నడుస్తున్నాను. కానివ్వండి!"

"ఇంతేనా నువ్వు చెప్పగలిగింది" అన్నాడు రామనాథం.

"ఇది చాలదా?" అంది రాధ ఆశ్చర్యంతో.

"చాలదు."

"ఎందువల్ల?"

"మొదటి సంగతి ఇదంతా నాకు తెలుసును కనుక."

ఇటువంటి అవస్థ చదువుకున్న పిల్లతో రాదని నిన్ను చేసుకున్నాను. నువ్వు పరీక్షలో పాసయ్యావు కాని నిజంగా చదువుకోలేదు. ఆ సంగతి నాకు చాలా కాలం క్రిందటనే తెలిసింది. నువ్వు సరయిన ప్రబంధ నాయికవి. నేను ప్రబంధ నాయకుణ్ణి కాను. నీ నుంచి నాకు కావలసింది ఒక సంసార సుఖమే కాకుండా కొంత మాతృత్వం కావలిసుంది. నాకు మా అమ్మతో పని కాక మునుపే, ఆవిడకు నాతో పనయిపోయిన మీద తనకు సహజంగా కలిగిన అధికారం చలాయించడంలో తప్ప తతిమ్మా విషయాల్లో ఆవిడ నన్ను పర పురుషుణ్ణి చూసినట్టు చూడటం ప్రారంభించింది. ఆవిడ నాకర్థమవుతూనే ఉంది. కాని నేనావిడ కర్థమవటం చాలించుకున్నాను. నేను మానసికంగా అభివృద్ధి అవుతూన్నకొద్దీ నాకు మాతృస్థానంనుంచి సానుభూతి, అండా కావలిసివచ్చినవి,

ఆ భార్యాత్వం మాతృత్వం నువ్వే నిర్వహిస్తావని నిన్ను చేసుకున్నాను. నాకు కావలిసింది నా తప్పు లెన్నే భార్య కాదు. నా మనస్సులో సున్నితమయిన భాగాలకు దెబ్బ తగిలినపుడు వాటికి తగిన లేపనం చెయ్యగలిగిన భార్య. నీ నుంచి అదే కోరాను. అది కాలేదు. నా మనస్సు నువ్వు కొంతవరకు పరీక్షించి ఇది ఎనుబోతు చర్మాన్ని మించి ఉందనే తీర్మానానికొచ్చావు. ఏం చేయను? అప్పుడు నిన్నూ నా తల్లిగా ఉండలేవా అని అడిగినప్పుడు నువ్వు చాలా నొచ్చుకున్నావు. నేను నీకు కలిగించిన ఉత్సాహ భంగాల్లో అదొకటి? అవునా! గత్యంతరం లేక నీ ఉత్సాహానికి సమానమైన ఉత్సాహం చూపిద్దామని ప్రయత్నం చేశాను. ఆటువంటి అసహజమైన పని చెయ్యటంవల్ల నా మనస్సెంత విరిగిందో నీకు చెప్పానా?" ఎన్నడూ చెప్పలేదు.

"నీకు ఆదిలో నా మీద ప్రేమ కలగటానికి ఏమీ కారణం లేదు. కర్మకాండలూ జరిగి మనిద్దరికీ పెళ్ళయిందన్న మాటే కాని నన్ను గురించి నీకేం తెల్సు? నీకు సంబంధించినంత వరకూ దారి బొయ్యేవాడికీ నాకూ భేదం ఏమిటి? అప్పుడు నా మీద నీకు గల అభిమానం నీ యితర ఆట వస్తువుల మీద గల మమకారం వంటిది కాదూ? అటువంటి నీ ప్రేమకు నే నేమని సంతోషించను? నే నిట్లాంటివాణ్ణని ఊహించి నా సుఖం నా ఆనందం ఇట్లా ఉండబోతవని నీకు నువ్వే అనుకుని చేసిన ప్రయత్నం నిజంగా నన్ను సంతోష పెట్టటానికీ సుఖపెట్టటానికీ చేసిన ప్రయత్నమౌతుందా? నీ ప్రయత్నం పదహారు వీసాలు నీవు సుఖపడటానికి చేసుకున్నదే! నా ప్రకృతి ఇటువంటిదని నేను ఏ మాత్రమైనా బయట పెట్టినప్పుడల్లా నీకు ఆశాభంగం ఉత్సాహ భంగం కలుగుతూ వచ్చింది? అప్పటికీ నేను కొంత బయటపడక తీరకపోయింది. నాలో మార్పొచ్చిందన్నావు! నే నసలేమిటో తెలీనిదానికి నాలో మార్పెట్లా తెలుస్తుంది? మహా తెలిస్తే నేనేమిటి కానో నీకు తెలిసి ఉండవచ్చును. లేకపోతే నేను యింకోరు చెబితే విని మారానన్నంత పొరపాటు పడతావా? ఉత్తది?

"ఎందుకు నేను నీతో మాటాడుతున్నప్పుడు నే ననే ముక్క ఒక్కటర్థమయింది? పని చెయ్యటం విషయం మా అమ్మా నువ్వూ పోట్లాడుతుంటే నేను నీ పక్షం తీసుకొని మాట్లాడుతూ నువ్వు తినే తిండికి చాకిరి చెయ్యకుండా ఉండటం బానిసత్వం కాదా అంటే నువ్వు, నేను నీ పక్షాన మాట్లాడుతున్నానన్న మాట నమ్మకపోవటమేకాక బానిసలే పని చేస్తారు. స్వతంత్రులు చెయ్యరన్నావు. కాని నిజమైన బానిసత్వం ఒకరికి ఋణ పడుతూ ఉండటమనీ, స్వతంత్రుడు ఊరికే దేనికీ ఆపేక్షించడనీ నీకు అర్థం కాకపోయింది. ఆలోచనా శక్తి

ఏమైంది? నువ్వు నాకు చేసిన భార్యాత్వం ఏ కడజాతి మనిషి చెయ్యలేదు? అది నాకు చాలుతుందా?

"నా తెలివి తేటల్లో నీకు ఎన్నడూ నమ్మకం లేదు. "మీకు తెలీదులెండి!" అని నువ్వెన్నిసార్లు అడ్డం వచ్చి నీ సలహా యిచ్చి, అది నేను తీసుకోకపోతే చిన్నబుచ్చుకున్నావు! ఇంక నన్ను చూస్తే ఆ నీకు అభిమానం ఏమిటి? నా శరీరం మీదనా? నీ కన్నా నేను తెలివితక్కువ వాణ్ణనుకుంటూ నన్ను చూస్తే నీ కభిమానమంటే నువ్వు నన్ను పెంపుడు కుక్కను .... ఆ పోలిక నీ కిష్టం లేకపోతే, నీ తాటాకు బొమ్మను చూసినట్టు చూడటం కాదా?

"నీ అంతట నువ్వు నన్ను గురించి తెలుసుకోకపోగా నేను బయటపెడు తూంటే ఏనాడు కళ్ళు మూసుకొన్నావో ఆనాడే నీకూ నాకూ బంధం తెగి పోయింది. నువ్వు నీ ఇష్టం వచ్చిన రామనాథంతో కాపరం చెయ్యదల్చు కున్నావు. అసలు రామనాథాన్ని కళ్ళెత్తయినా చూడవు. వాణ్ణి గుర్తు పట్టవు.

"నాకు ఇంద్రియ వాంఛ లేకపోలేదు. నేనూ మనిషినే. నీ వంటి అంగ సౌష్టవం గల భార్యను దగ్గిర పెట్టుకుని నే నెందుకు దెత్తివడాలి. పది పుట్ల పాతరేసుకున్నవాడు ఏ పూట కా పూట అన్నం కోసం తర తర లాడటం ఎందుకో నా కర్థం కావడం లేదు. నేను నిన్ను భార్యను చేసుకున్నందుకు పొందుతున్న అహంకారమంతా ఇప్పుడెందుకు చర్చించటం?"

రాధ తల వంచుకుని ఊరకుంది.

"నేను ఒంటరిగాణ్ణయిపోయినాను. రాధా! నీతో ఏ విషయం యిట్లా మాట్లాడలేదు. నా మనస్సుకు చెప్పరాని గాయాలు తగిలి మచ్చలు పడిపో తుంటై. చాలా రోజులు బాధ పెట్టి, స్నేహితులతో చెప్పుకునే విషయాలుకూడా కావు. నువ్వు వచ్చిన క్షణం నుంచీ, నిశ్చింతగా ఉండవచ్చు ననుకున్నాను. మా అమ్మా వాళ్ళందరినీ మొరిగే కుక్కల కింద కట్టేసి ఊరుకుంటావను కున్నాను.

ఇప్పుడు నిన్ను మీ వూరు తీసుకుపోవటం వాళ్ళ బారి నుండి నిన్ను తప్పించటానికని కూడా నువ్వు కనుక్కోలేదు. అందుకోసం నేను నీతో ఇప్ప దనుభవిస్తున్న సుఖం కూడా వదులుకొంటున్నానని గమనించక పోయినావు!.... కొంత కాలం ప్రపంచం చూడు రాధా! కొంత అనుభవం వుంటే నే నెంత కటిక వాణ్ణల్లే కనబడనని ధైర్యం వుంది. నేను మాట్లాడే నిజాలు నీకిప్పుడు సుత్తి దెబ్బలల్లే ఉన్నా ఒకప్పుడు వాటి వాసనే నీకింపుగా ఉండి అవే మల్లెపూలల్లే కనపడవచ్చును. ఆనాడు నా దగ్గరకు రా. నీలో ఎంత మార్పు కలిగినాసరే నీ సహజ రూపం అప్పుడెట్లా ఉన్నా సరే. నేను తట్టుకోగలనని నాకు నమ్మకం

ఉంది. లోకంలో చొరబడి అనుభవం సంపాదించు. మెదడు లేని వాళ్ళకు అనుభవం లేని వాళ్ళను చూస్తే భయం. నాకు అనుభవం గల వాళ్ళను చూస్తే ఇష్టం. వాళ్ళ అనుభవం ఎంత అసహ్యమైనదైనా సరే! మరొకటి. ప్రతిదాన్ని గురించి ఆలోచిస్తూ ఉండు. ఆ తలకు ఒక్క నిమిషం తీరిక ఇవ్వకు. మిగిలినవన్నీ ఒక ఎత్తు. ఆ మెదడు ఒక్కటీ ఒక ఎత్తు. నేను నీవల్ల ఎంత సుఖపడ్డానో అదివరకల్లా చెప్పడం అనవసరమైపోయింది .... ఇప్పుడు చెప్పడం అసాధ్యంగా ఉంది! .... ఇంతే నేను నీకు చెప్పదల్చుకుంది?"

రయిలు ఒక చిన్న స్టేషను చేరి ఆగింది. రెండు మూడు నిమిషాలు గడచిపోయినయి. రయిలు బయలుదేరే ప్రయత్నంలో లేదు.

"ఈ బండి ఇక్కడ ఇంత సేపున్నదేం" అంది రాధ ఏ మార్పు లేని గొంతుతో.

రామనాథం కిందగా పోతున్న అండర్ గార్డును పిలిచి రైలాగటానికి కారణం అడిగాడు.

"థర్టీ టూ డౌన్ క్రాసింగ్ సార్" అన్నాడు గౌరవార్థం టోపీ ముట్టుకుని,

రాధ చప్పున మొగుడి దగ్గరికి వచ్చి, "అయితే మనం ఆ బండి ఎందుకు ఎక్కకూడదు" అంది చిన్న గొంతుతో. రామనాథం అర్థం కాకుండా ఒక్క క్షణం చూసి ఒక్కసారి నవ్వి చెయ్యి చాపి "సై" అన్నాడు.

రాధ అతని చేతిలో చేయి వేసింది.

"రామనాథం, థాంక్‌యూ!" అంటూ చెంగున లేచి మనీపర్సు పుచ్చుకొని నాలుగంగల్లో బుకింగ్ చేరుకున్నాడు.

[ప్రథమ ముద్రణ : ఆగస్టు 1934, ప్రభాతము,
పునర్ముద్రణ : సారంగి, 1 నవంబరు, 1959]